క్లుప్తంగా

సీఎం సహాయనిధితో కార్పొరేట్ వైద్యం
ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: ఆపద సమయంలో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. డివిజన్‌కి చెందిన వికాస్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ద్వారా సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.80 వేల ఎల్‌ఓసీని గురువారం బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

డంప్‌యార్డు తనిఖీ



చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధి జూకల్ శివారులోని డంప్‌యార్డును గురువారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తనిఖీ చేశారు. తడి, పొడి చెత్త నిల్వలను పరిశీలించారు. విండ్రో కంపోస్టింగ్ నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. శానిటరీ అధికారి శ్రీనివాస్‌తో పాటు పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన పలు సూచనలు, సలహాలిచ్చారు. పలుమార్లు అగ్ని ప్రమాదాలు జగడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు.

పాతబాకీలు చెల్లించి.. రుణాలు పొందండి



గ్రామాల్లో వసూలు చేస్తున్న శ్రీనివాస్

కంగ్టి(నారాయణఖేడ్): రైతులు గతంలో తీసుకొన్న పాతబాకీలు చెల్లించి.. కొత్త రుణాలు పొందాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డీజీఎం శ్రీనివాస్ తెలిపారు. గురువారం నారాయణఖేడ్, సిర్గాపూర్ డీసీసీ బ్రాంచ్‌ల మేనేజర్లు వెంకటేశం, దీపక్‌తో కలిసి మండలంలోని నాగుర్, కంగ్టి, తుర్కవడ్గాం, సుక్కల్‌తీర్థ్ తదితర గ్రామాల్లో పాత బాకీల వసూళ్లు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికి తిరిగి పాతబాకీలు చెల్లించమని ఆడిగి, నోటీసులు జారీ చేయనున్నట్లు చెప్పారు. పాతబాకీలు చెల్లించని వారి భూములను వేలం వేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది నాగిరెడ్డి, అడివప్ప పాల్గొన్నారు.

జాతీయ పక్షిని కాపాడిన రైతు



నెమలిని అధికారులకు అప్పగిస్తున్న వీరేశం

హత్నూర(సంగారెడ్డి): కోతుల దాడిలో గాయపడిన జాతీయ పక్షి నెమలిని ఓ రైతు కాపాడి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. గురువారం హత్నూర మండలం దౌలాపూర్ గ్రామశివారులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు చింత వీరేశం తన పొలంలో పనులు చేస్తున్న క్రమంలో జాతీయ పక్షి నెమలిని కోతులు దాడి చేసిన విషయాన్ని గమనించారు. గాయాలయిన నెమలికి వైద్యం చేయించి.. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చి వారి అప్పగించారు. నెమలిని రక్షించిన రైతు వీరేశంను స్థానికులు అభినందించారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

సంగారెడ్డి: పట్టణంలో తాగునీటి సరఫరా శుక్రవారం నిలిచిపోనుందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చాణిక్యపూరి కాలనీలోని ఓహెచ్ఎస్ఆర్ పరిధిలో ఉన్న 2300 కె.లీ సంపు క్లీనింగ్ చేయనునందున నీటి సరఫరాకి అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. తిరిగి శనివారం నుంచి నీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు.

అసంపూర్తిగా బ్రిడ్జి పనులు

- మూడేళ్లుగా పూర్తికాని దుస్థితి
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- రోడ్డు పనులు పూర్తి చేయాలని వినతి



జహీరాబాద్-అల్గోల్ వద్ద నిర్మించిన బ్రిడ్జి

జహీరాబాద్ టౌన్: రాకపోకలు సాఫీగా సాగేందుకు నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రోడ్డు పనులు ఆగిపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్ పనులు ఆపేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. జహీరాబాద్ నుంచి భరత్‌నగర్ గుండా అల్గోల్ వెళ్లేదారిలో మురికి (వాగు) కాలువ ఉంది. పట్టణం నుంచి వచ్చే మురికి నీరు వల్ల వాగు నిత్యం ప్రవహిస్తుంది. వర్షాలు కురిసిన సమయంలో మురికినీరు రహదారిపై నుంచి ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ రోడ్డు గుండా అల్గోల్‌తో పాటు పలు గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. ప్రజల ఇబ్బందులను గమనించిన ఆర్‌అండ్‌బీ అధికారులు మూడు సంవత్సరాల క్రితం బ్రిడ్జి, రోడ్డు నిర్మాణానికి రూ. 33 లక్షల నిధులు మంజూరు చేయించారు. టెండర్ పనులు పూర్తికాగానే కాంట్రాక్టర్ బ్రిడ్జి పనులు ప్రారంభించారు. వర్షాకాలం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉండగా బిల్లులు విడుదల జాప్యం కారణంగా పనులు నిలిపేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో స్థానిక నాయకులు స్పందించి అధికారులతో మాట్లాడి ఆగిన బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేయించారు. కల్వర్టు పనులు పూర్తి అయినప్పటికీ రోడ్డు పనులు ప్రారంభించలేదు. తిరిగి వర్షాకాలం ప్రారంభంకావడంతో రోడ్డు బురద, గుంతలమయంగా తయారైంది. దెబ్బతిన్న రోడ్డు వల్ల వాహనాల రాకపోకలకు కష్టంగా మారింది. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగిన ఘటనలు చాలానే ఉన్నాయి. స్పందించిన కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి రోడ్డుపై మొరం వేయించారు. దీంతో వాహనాల రాకపోకలకు కొంత ఊరట లభించింది. నెలలు గడుస్తున్నా బీటీ రోడ్డు పనులు ప్రారంభించడం లేదు. మట్టి వల్ల దుమ్ములేచి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే బీటీ రోడ్డు పనులు పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



నిలిచిపోయిన రోడ్డు పనులు

మహిళలు పోరాటానికి సిద్ధం కావాలి



ర్యాలీలో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బీరం మల్లేశం డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలోని సుందరయ్య భవన్ నుంచి ఐబీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న నేటి పాలకులకు శ్రమన్నా, శ్రమ చేసే మహిళలన్నా గౌరవం లేదని విమర్శించారు. మహిళా హక్కులు మానవ హక్కుల్లో భాగమనే విషయం మర్చిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బీజేపీ ప్రభుత్వం మహిళల హక్కులను హరిస్తుందని, దేశవ్యాప్తంగా మహిళలు, పిల్లలపై లైంగిక దాడులు, హింస పెరిగిపోయిందని వాపోయారు. మహిళలకు రక్షణ కల్పించకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, సీఐటీయూ నాయకురాలు వరలక్ష్మి, వీరమణి, లక్ష్మి మరియమ్మ, రమాదేవి మంజుల, సునీత, లక్ష్మి నరసమ్మ, రాజేశ్వరి, మల్లమ్మ ఎల్లమ్మ పాల్గొన్నారు.

జాతీయ రహదారిగా అభివృద్ధి చేయండి



కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జోగినాథ్

జోగిపేట(అందోల్): అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం-మెటల్‌కుంట రోడ్డును జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా జోగినాథ్ అన్నారు. గురువారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ, కర్ణాటకలను కలిపే ఈ రోడ్డు మీదుగా ప్రతి రోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయని వివరించారు. ఈ రోడ్డు ఇటీవల గుంతలమయంగా మారిందన్నారు. స్పందించిన కిషన్‌రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాయనున్నట్లు చెప్పారు.

కులగణన సర్వే డబ్బులు చెల్లించాలి



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కులగణన సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ పరమేశంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కులగణన సర్వే చేసి మూడు నెలలు కావస్తున్నా ఇప్పటికీ రెమ్యునరేషన్ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఎస్ఎస్‌సీ స్పాట్ నిర్వహించిన ఉపాధ్యాయులకు సంవత్సరం కావస్తున్నా వారికి కూడా ఇప్పటివరకు రెమ్యునరేషన్ ఇవ్వలేదని వాపోయారు. ఎస్ఎస్‌సీ స్పాట్ రెమ్యునేషన్స్ మిగతా అన్ని జిల్లాల్లో చెల్లించారని.. సంగారెడ్డి జిల్లాలో జాప్యానికి కారణం ఏంటని ప్రశ్నించారు?.. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు, కార్యదర్శి సాయితేజ, నాయకులు ప్రభాకర్ కృష్ణ పాల్గొన్నారు.

సేంద్రియ సాగు పద్ధతులపై శిక్షణ



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ల ప్రదానం

జహీరాబాద్ టౌన్: పట్టణ సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం యువతకు సేంద్రియ సాగుపై నాలుగు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించారు. గురువారం కేవీకే సీనియర్ శాస్త్రవేత్త వరప్రసాద్ మాట్లాడుతూ.. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతిలో పంటలు పండించి వాటినే తినాలన్నారు. సేంద్రియ వ్యవసాయం రోజు రోజుకు ప్రాచుర్యం పొందుతుందని, ప్రభుత్వాలు కూడా ప్రోత్సహిస్తునట్లు చెప్పారు. తేనెటీగల పెంపకం, వర్మీకంపోస్టు తయారు, శాస్త్రీయ పద్ధతిలో నారు పెంపకం, మేకల పెంపకం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైంటిస్టులు డాక్టర్ స్నేహలత, శైలజ, రమేష్, హేమలత, సాయి ప్రియాంక, కై లేష్ మద్నే, సిద్దులు పాల్గొన్నారు. శిక్షణ ముగింపు సందర్భంగా సర్టిఫికెట్లను అందజేశారు.

రెండేళ్లు చైల్డ్ కేర్ సెలవులివ్వాలి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

సదాశివపేట(సంగారెడ్డి): మహిళా ఉపాధ్యాయులకు రెండు ఏళ్లు చైల్డ్ కేర్ సెలవులు ఇవ్వడంతో పాటు కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న మహిళలకు సమాన వేతనం ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. గురువారం పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రమాదంలో మహిళల హక్కులు.. మన కర్తవ్యం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాస్‌రావు, సుప్రియ, సురేష్, మధూసూదన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

‘సురక్షిత గ్రామం’పై అవగాహన

జహీరాబాద్ టౌన్: మండలంలోని సత్వార్ గ్రామంలో గ్లో ఇండియా సంస్థ వారు పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ‘సురక్షిత గ్రామం’ అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో జరిగే సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని వివరించారు. బాల్యవివాహాలు చేయడం నేరమని, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కిరణ్‌పాల్, నర్సింలు, పాఠశాల హెచ్ఎం. బస్వరాజ్ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులు, విద్యార్థులు

నారాయణఖేడ్: మండలంలోని మన్సూర్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలనా దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడిగా అన్వేష్, ఉపాధ్యాయులుగా ఎ.రితిక, బి.రితిక, జక్షి వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా హర్షిత, డీఈఓగా నాగరాజు, ఎంఈఓగా నిఖిత వ్యవహరిస్తూ తనిఖీలు చేశారు. ప్రధానోపాధ్యాయులు సీహెచ్.విఠల్, ఉపాధ్యాయురాలు లక్ష్మి పర్యవేక్షించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న రామచంద్రారెడ్డి దంపతులు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. విగ్రహ దాత అంతిరెడ్డిగారి లక్ష్మీరామచంద్రారెడ్డి దంపతులతో దర్పల్లి లక్ష్మణాచారి, వేద పండితులు నారాయణచార్యులు శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాపన పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

జిల్లా అధ్యక్షుడుగా జనార్దన్

సంగారెడ్డి : ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం 29 మందితో కూడిన సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జనార్దన్, అసోసియేట్ అధ్యక్షుడిగా రాములు, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా తిరుమలరావు, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా రామకృష్ణ సహాయ ప్రచార కార్యదర్శిగా నర్సింలు, సలహాదారుగా నారాయణ వివిధ సభ్యులను వివిధ హోదాల్లో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేస్తానన్నారు. బీసీల్లో అధిక సంఖ్యలో జనాభా ఉండటంతో తాము నష్టపోతున్నామని అన్నారు. ప్రభుత్వం స్పందించి బీసీ బి నుంచి బీసీ ఏకు మార్చాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్, రాంచందర్, శ్రీనివాస్, లక్ష్మి, సుగుణాకర్ పాల్గొన్నారు.

కనులపండువగా విగ్రహ ప్రతిష్ఠాపన



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు

నారాయణఖేడ్: పట్టణ శివారులో నూతనంగా నిర్మించిన భక్తమార్కండేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కనుల పండువగా సాగింది. రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాదవానంద సరస్వతీ స్వామితో పాటు అంతర్గాం పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహరాజ్, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అనుపమారెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మశ్చందర్, జిల్లా ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, పద్మశాలీ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కల్పించాలి

మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ



జహీరాబాద్‌లో నిర్వహిస్తున్న డప్పుల ప్రదర్శన

జహీరాబాద్ టౌన్: ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కల్పించాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు పట్టణంలో గురువారం డప్పుల ప్రదర్శన నిర్వహించారు. అతిథిగృహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు డప్పుల ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ అశాస్త్రీయంగా ఉందని, మాదిగ జనాభాను తగ్గిస్తున్నారని ఆరోపించారు. 11 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉండగా 9 శాతం మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుచెంద్ర మాట్లాడుతూ.. రిజర్వేషన్ వ్యవహారంలో లోపాలు ఉన్నాయని వాటిని సవరించాలన్నారు. మంత్రి వర్గవిస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జైరాజ్ మాదిగ, రాంచందర్, నవీన్‌కుమార్, మచ్చేందర్, శ్రీనివాస్, ప్రవీణ్, నర్సింలు, రాజు, మైకేల్ పాల్గొన్నారు.

షెడ్డు కూల్చివేత

పటాన్‌చెరు: డివిజన్‌లో నాలాను ఆనుకుని నిర్మించిన ఓ షెడ్డును ఇరిగేషన్ అధికారులు కూల్చేశారు. నాలాను ఆనుకుని నిర్మాణాలు జరుగుతున్నాయని తెలుసుకున్న ఇరిగేషన్ ఏఈ పావని గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన షెడ్డును వెంటనే నేలమట్టం చేశారు. నాలాపై అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ అధికారులు హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ **పశువుల షెడ్లు, నర్సరీల పరిశీలన**

జహీరాబాద్ టౌన్: జాతీయ ఉపాధిహామీ పథకం కింద నిర్మిస్తున్న పశువుల షెడ్లు, నర్సరీలను గురువారం మొగుడంపల్లి మండల ఏపీఓ గణేష్ పరిశీలించారు. మండలంలోని మాడ్గి, ఔరంగ్‌నగర్‌లో ఈజీఎస్ నిధులతో పశువుల షెడ్లు, నర్సరీలో మొక్కలు పెంచుతున్నారు. పశువుల పెంపకానికి అనువుగా షెడ్ల నిర్మాణం, నర్సరీల్లో పనులు జరుగుతున్నాయని పరిశీలించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ సంజు ఉన్నారు.

◆ **ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం**

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని రాపర్తిలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభించారు. ఎంపీడీఓ రమేష్‌బాబు ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఇళ్ల నిర్మాణం కోసం మార్కింగ్ వేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లేశం, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రావణ్‌కుమార్, గ్రామస్తులు హన్మండ్లు, పరంధాములు పాల్గొన్నారు.

◆ **వేతనాలు చెల్లించాలని వినతి**

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో గంటల ప్రాతిపదికన పాఠాలు బోధిస్తున్న హెచ్‌బీటీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని మండల విద్యాధికారి అంజయ్యకు గురువారం వినతిపత్రం అందజేశారు. గత ఏడాదికి సంబంధించి రెండు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉన్నా ఇప్పటివరకు రాలేదన్నారు. జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నా తమకు తగిన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వేతనాలు వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌బీటీలు మోహన్‌రాజ్, శశిశంకర్, సుధాకర్, మమత, సౌమ్య, లక్ష్మి, బసమ్మ, సంధ్య ఉన్నారు.

◆ **ఎల్‌ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ప్రారంభం**

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుదారుల కోసం మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుదారుల కోసం ఫీజు చెల్లింపులో 25 శాతం రాయితీ కల్పిస్తూ జీఓ జారీ చేసింది. ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్చి 31 లోపు ఫీజు చెల్లించిన వారికి మాత్రమే ఉంటుందన్నారు.

◆ **నేడు విద్యుత్ అంతరాయం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ సబ్‌స్టేషన్‌లోమర్మమతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉ.11గంటల నుంచి మ. 3గంటల వరకు తెల్లాపూర్ వ్యవసాయ ఫిడర్, 11గంటల నుంచి 1గంటల వరకు ఉస్మాన్‌నగర్ పరిసర ప్రాంతాలు, 11గంటల నుంచి 3గంటల వరకు ముప్పా, ఆల్‌మార్క్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

◆ **10న ఐటీఐ అప్రెంటిషిప్ మేళా**

హత్నూర(సంగారెడ్డి) : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో ఉత్తీర్ణులైన అన్ని ట్రేడ్ల అభ్యర్థులకు ఈ నెల 10న ఉ. 10 గంటలకు మండల కేంద్రం హత్నూర గురుకుల ఐటీఐ ఆవరణలో అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వీవీ సుబ్బలక్ష్మి గురువారం తెలిపారు. వివిధ పరిశ్రమల్లో అప్రెంటిషిప్ ట్రైనింగ్ చేసేందుకు ఆసక్తిగా ఉన్న అభ్యర్థులు ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా కార్యక్రమంలో పాల్గొని ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు (WWW. apprenticerhipIndia.gov.In) నమోదు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తు జిరాక్స్ ప్రతులు, బయోడేటా ఫారంతో పాటు సంబంధిత విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు జత చేసి వెంట తీసుకురావాలని తెలిపారు. మేళాకు హాజరైన అభ్యర్థులకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో అప్రెంటిషిప్ అవకాశం కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ఐటీఐ అభ్యర్థులు సద్వినియోగించుకోవాలని సూచించారు.

విజయోత్సవ సంబరాలు


ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ నాయకుడు అంజిరెడ్డి విజయం సాధించిన నేపథ్యంలో గురువారం బీజేపీ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకొన్నారు. కాషాయ జెండాలతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. టపాసులు కాల్చి, మిఠాయిలు పంచి పెట్టి సంతోషం వ్యక్తం చేశారు. అంజిరెడ్డికి ఓటు వేసిన పట్టభద్రులందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.




జిన్నారం: సంబరాలు చేస్తున్న బీజేపీ శ్రేణులు



సదాశివపేట రూరల్ : గొల్లగూడెంలో..



పటాన్‌చెరు టౌన్: అంబేడ్కర్ చౌరస్తా వద్ద..



జోగిపేటలో..